# ఆడియో టెక్నాలజీలో ఊహించని అభివృద్ధి

## విశిష్ట వక్తలతో ఉపన్యాసాల సభలో జర్మనీ ప్రొఫెసర్ కార్ల్ హీన్జ్ బ్రాండెన్ బర్గ్





పటాన్‌చెరు ఏప్రిల్ 8 ( సిరి న్యూస్ )

ఆడియోరంగంలో చోటుచేసుకుంటున్న అధునాతన పరిజ్ఞానంపై ప్రపంచ ప్రఖ్యాత ఆడియో టెక్నాలజీ మార్గదర్శకుడు, బ్రాండెన్‌బర్గ్ ల్యాబ్స్ జీఎంబీహెచ్ సీఈవో, జర్మనీలోని ఇల్మెనావ్ టెక్నికల్ విశ్వవిద్యాలయ సీనియర్ ప్రొఫెసర్ కార్ల్ హీన్జ్ బ్రాండెన్ బర్గ్ అవగాహన కల్పించారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం హైదరాబాద్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం (ఈఈసీఈ) సిగ్నల్ ప్రాసెసింగ్, అంతర్జాతీయ కెరీర్ అభివృద్ధి రంగాలపై విశిష్ట వక్తలతో ఉపన్యాసాలు నిర్వహించింది. ఎంపీ3 ఫార్మాట్ కీలక ఆవిష్కర్తలలో ఒకరిగా పేరొందిన ప్రొఫెసర్ బ్రాండెన్ బర్గ్, ఓకియానోస్ ప్రో, పార్టీ వంటి అత్యాధునిక సాంకేతికతలపై ప్రొఫెసర్ లోతైనఅవగాహన కల్పించారు.ఆడియో కోడింగ్ పరిణామం, శ్రవణ అవగాహనలో పురోగతి, మ్యూజిక్ ఇన్ఫర్మేషన్ రిట్రీవల్ (ఎంఐఆర్), స్పేషియల్ ఆడియో, హెడ్ ఫోన్ ఆధారిత లిజనింగ్ టెక్నాలజీల వంటి ఉద్భవిస్తున్న ధోరణులను ప్రొఫెసర్ బ్రాండెన్ బర్గ్ వివరించారు. 2026 నాటికి క్యూ4లో ప్రారంభించే అవకాశం ఉన్న బిల్ట్-ఇన్ హెడ్-ట్రాకింగ్ సెన్సార్‌లతో కూడిన కొత్త హెడ్ ఫోన్ ఉత్పత్తి కోసం ప్రణాళికలను ఆయన వెల్లడించారు.భవిష్యత్తులో ఊహించని స్థాయిలో ఆడియో టెక్నాలజీ అభివృద్ధి చెందుతుందని ప్రొఫెసర్ కార్ల్ హీన్జ్ బ్రాండెన్ బర్గ్ తెలిపారు. న్యూఢిల్లీలోని సెరాఫిమ్ కమ్యూనికేషన్స్ ఎల్ఎల్పీ వ్యవస్థాపకురాలు, సీఈవో సునందరావు-ఎర్డెమ్ జర్మనీలో వృత్తిపరమైన అవకాశాలు అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రామస్వామి వేదాల, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టీ మాధవి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చేపూరి అఖిలేశ్, ఈఈసీఈ ప్రొఫెసర్ త్రినాథరావు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ప్రత్యేక ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, ఏప్రిల్ 8 ( సిరి న్యూస్ )



దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారి,డిఆర్ఓ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 23 దరఖాస్తులు వచ్చాయి. దివ్యాంగుల కొరకు ప్రతినెల మొదటి శనివారంలో ప్రత్యేక ప్రజావాణి కొనసాగుతుందని ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు త్వరితగతను పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. సదరం సర్టిఫికెట్, రెన్యూవల్ కోసంసంబంధిత దివ్యాంగులకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సదరం క్యాంపులో స్లాట్ బుకింగ్ కోసం మొబైల్ యాప్లో సిటిజన్ స్లాట్ బుకింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. నెలలో రెండుసార్లు సదరం స్లాట్ బుకింగ్, నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ, డిఆర్డిఏ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పరమేశం

గుమ్మడిదల రూరల్, ఏప్రిల్ 8 సిరి న్యూస్



గుమ్మడిదల మండలం నూతన తహసిల్దార్‌గా పరమేశం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిరి న్యూస్ తో మాట్లాడుతూ గుమ్మడిదల మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు తహసిల్దార్ కార్యాలయం ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలందరికీ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ,సమస్యలు తీర్చడానికి అందుబాటులో ఉంటామని తెలిపారు.పారదర్శక పాలన కోసం చర్యలు తీసుకుంటామని అన్నారు అనంతరం గుమ్మడిదల రేషన్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిర్దవార్ శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**తహసిల్దారును సన్మానించిన రైతు సంఘం అధ్యక్షులు**

నూతనంగా గుమ్మడిదల మండల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన పరమేశం రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ ప్రాంతంలో రైతులు అధిక సంఖ్యలో వ్యవసాయంపైనే ఆధారపడిన వారు ఉన్నారని తహసిల్దారు దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచేందుకు ప్రభుత్వ సహాయం అవసరం ఉందని తెలిపారు వీరితోపాటు దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి కోశాధికారి రవీందర్ రెడ్డి మంద భాస్కర్ రెడ్డి వెంకటేశం గౌడ్ ముత్యాల రవీందర్ రెడ్డి తదితరు పాల్గొన్నారు

# పదవ తరగతి మూల్యాంకన కేంద్రం పరిశీలన

సంగారెడ్డి, ఏప్రిల్ 8 ( సిరి న్యూస్ )

జిల్లాలోని రామచంద్రాపురం లో గల సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇవి, నరసింహారెడ్డి ,డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు,సందర్శించారు. మూల్యాంకన కేంద్రంలోగల స్ట్రాంగ్ రూమును, బార్ కోడింగ్, గదిని, మూల్యాంకనం జరుగుతున్న వివిధ సబ్జెక్టుల యొక్క గదులను కూడా పరిశీలించారు. మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడారు.మూల్యాంకన కేంద్రం, మూల్యాంకనం జరుగుతున్న తీరుపై మూల్యాంకన కేంద్రంలో గల వసతులపై డైరెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. వీరితోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి మరియు క్యాంప్ఆఫీసర్ ,వెంకటేశ్వర్లు డిప్యూటీ క్యాంప్ఆఫీసర్ లింబాజీ ఉన్నారు.

# నారాయణఖేడ్ తహసిల్దారుగా హసీనా బేగం

నారాయణఖేడ్ ఏప్రిల్ 8 (సిరి న్యూస్)



నారాయణఖేడ్ మండలం నూతన తహసిల్దారుగా హసీనా బేగం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మొగుడంపల్లి తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై నారాయణఖేడ్ కు వచ్చారు.

## తల్లిని వేధిస్తున్నాడని వేటేశాడు!

# హత్య కేసులో నిందితుల అరెస్టు

జహీరాబాద్, ఏప్రిల్ 8 ( సిరి న్యూస్ )



తల్లికి తరచూ ఫోన్‌చేసి వేధిస్తున్న వ్యక్తిని ఆమె కుమారుడు స్నేహితుడితో కలిసి హత్య చేసిన ఘటనలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లిపోలీసులు నిందితులను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో మంగళ వారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మొగడం పల్లి మండలం ధనసిరికి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ అబ్బాస్(25) ఈనెల 6న గ్రామ శివారులో మిత్రులతో కలిసి విందు నిమిత్తం వంట సిద్ధం చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హతురాలి కుమారుడు ఖలీల్‌షా, ఇదే గ్రామానికి చెందిన మిత్రుడు మెహతాబ్ బిస్తి(27)తో కలిసి అక్కడికి వెళ్లాడు. వేట కొడవళ్లతో వెళ్లి అబ్బాస్‌ను దారుణంగా హత్యచేశారు. అడ్డొచ్చిన షేక్ అక్బర్‌అలీ ముఖంపై సీసాతో దాడిచేశారు. నిందితులు పారిపోతూ అటుగా వచ్చిన శేఖర్‌ను ఎయిర్‌గన్‌తో బెదిరించి అతడి బైక్‌ను తీసుకొని పరారయ్యారు. మంగళవారం జహీరాబాద్ పరిధి హుగ్గెల్లి నగర్‌లో ఉన్న నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి బైక్, స్కూటీ సహా రెండు కత్తులు, ఎయిర్‌గన్, చరవాణి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు.